తంగేడు పువ్వుల్లా చందమామ.. బతుకమ్మ వెడలే చందమామ




సూర్యాపేటలో పెద్ద బతుకమ్మను నిమజ్జనానికి తీసుకెళ్తూ..

పల్లె, పట్టణం ఏకమైంది.. ఊరువాడా కదలివచ్చింది..అందరి అడుగులు చెరువుల వైపు కదిలాయి.. బతుకమ్మ పాటలు మారుమోగాయి.. గురువారం జిల్లావ్యాప్తంగా సద్దుల బతుకమ్మ వేడుకలు వైభవంగా ముగిశాయి.. తొమ్మిది రోజుల పాటు రోజుకో రకమైన నైవేద్యాన్ని గౌరమ్మకు సమర్పించారు.. చివరి రోజు సద్దుల బతుకమ్మ వేడుకలు జరిపారు.. తంగేడు, బంతి, చేమంతి.. ఇలా రక రకాల పూలతో పెద్ద పెద్ద బతుకమ్మలను పేర్చి ఒక దగ్గర చేర్చి ఆనందంగా ఆడారు. పాడారు..మరో ఏడాది వరకు అనుభూతులను మదిలో దాచుకున్నారు.
- న్యూస్‌టుడే బృందం


సూర్యాపేట: రైతు బజారు వద్ద మహిళల సందడి

హుజూర్‌నగర్ ఎన్జీవోస్ కాలనీలో...

సూర్యాపేటలో యువతుల ఆనందోత్సవం




సూర్యాపేటలో...

సూర్యాపేట: అంబేడ్కర్ విగ్రహం వద్ద...






సూర్యాపేట: అన్నాదురైనగర్ వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలతో పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి


సూర్యాపేట: సద్దుల చెరువులో కుటుంబ సభ్యులతో కలిసి బతుకమ్మను నిమజ్జనం చేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

ఆహార భద్రత.. 2028

మిర్యాలగూడ పట్టణం, భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే: కరోనాతో కుదేలైన పేదలను ఆదుకునేందుకు కేంద్రం ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన పథకం కింద ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తూ వస్తోంది. 2021 నుంచి మూడు నెలలకోసారి పథకాన్ని పొడిగిస్తూ వస్తున్న కేంద్రం.. 2023 డిసెంబరులో ఒకేసారి ఏడాది పాటు ఉచిత బియ్యం అందించనున్నట్లు ప్రకటించింది. ఉచిత బియ్యం పంపిణీ గడువు ఈ ఏడాది డిసెంబరుతో ముగియనుండడంతో మరోసారి భేటీ అయిన కేంద్ర మంత్రివర్గం ఈ పథకాన్ని మరో నాలుగేళ్ల పాటు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. 2028 డిసెంబరు వరకు ఆహార భద్రత కార్డుదారులకు ఉచిత బియ్యం పంపిణీకి కేంద్ర మంత్రివర్గం బుధవారం ఆమోదం తెలిపింది.

ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీ..

ఆహార భద్రత కార్డుదారులకు గత కొంత కాలంగా కేంద్రం ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీ చేస్తుంది. ప్రస్తుతం పంపిణీ చేసేందుకు నిర్ణయించిన బియ్యం సైతం పోషకాలు కలిగిన ఫోర్టిఫైడ్ బియ్యం మాత్రమే పంపిణీ చేయాలని కేంద్రం నిర్ణయించింది. దీంతో పేదలకు బలవర్ధకమైన ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీ మరో నాలుగేళ్ల పాటు కొనసాగనుంది. ఫోర్టిఫైడ్ బియ్యంలో ఐరన్, ఫోలిక్ యాసిడ్, విటమిన్ బి-12 పోషకాలు ఉంటాయి.

ఉమ్మడి జిల్లాలో 10,07,039 కార్డుదారులకు లబ్ధి..

కేంద్రం నిర్ణయంతో ఉమ్మడి జిల్లాలోని 10,07,039 కార్డుల్లోని 29,83,445 మంది యూనిట్లకు నాలుగేళ్ల పాటు లబ్ధి చేకూరనుంది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో మొత్తం 63,795 అంత్యోదయ కార్డులు ఉండగా.. ఒక్కో కార్డుకు 35 కిలోల చొప్పున, 9,43,145 ఆహార భద్రత కార్డులు ఉండగా.. ఇందులోని యూనిట్‌కు 5 కిలోల చొప్పున ఉచిత బియ్యం పంపిణీ చేస్తున్నారు. అక్టోబరులో అంత్యోదయ కార్డులకు 22,32,825 కిలోలు, ఆహార భద్రత కార్డులకు 1,68,41,556 కిలోల బియ్యం పంపిణీ చేయనున్నారు.

లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలి:

వెంకటేశ్వర్లు, డీఎస్‌వో, నల్గొండ

కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో 2028 డిసెంబరు వరకు రేషన్ కార్డుదారులకు ఉచిత బియ్యం పంపిణీ చేయనున్నాం. ప్రస్తుతం రేషన్ దుకాణాల్లో బలవర్ధకమైన ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీ చేయనున్నందున లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలి.

ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం రేషన్ కార్డులు, అక్టోబరులో కేటాయించిన బియ్యం వివరాలు..

జిల్లా	మొత్తం కార్డులు	యూనిట్లు	బియ్యం (మె.టన్నుల్లో)
నల్గొండ	4,66,015	13,92,156	8,914.099
సూర్యాపేట	3,24,184	9,31,351	5,945.164
యాదాద్రి	2,16,840	6,59,938	4,216.108


నేరేడుచర్ల: విజయదుర్గ ఆలయం వద్ద...

సర్వే సమాప్తం.. ఆన్‌లైన్‌లో నిక్షిప్తం


సూర్యాపేటలోని 37వ వార్డులో డిజిటల్ కార్డు కోసం చేపడుతున్న సర్వే (పాత చిత్రం)

భానుపురి, న్యూస్‌టుడే: ప్రతి కుటుంబానికి డిజిటల్ రేషన్‌కార్డు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకు ఈనెల 3 నుంచి 7 వరకు జిల్లాలో అధికారులు ఇంటింటి సర్వే నిర్వహించారు. ముందుగా పైలెట్ ప్రాజెక్టు కింద పురపాలికలు, నియోజకవర్గంలోని మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేశారు. ఆ గ్రామాల్లో సర్వే పూర్తిగా వాటి వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు. నిర్దేశిత గడువుకు ఒక రోజు ముందుగానే సర్వే పూర్తి చేసిన అధికార యంత్రాంగం వివరాలను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేసే పనిలో నిమగ్నమయ్యారు. రెండురోజుల్లో పూర్తి చేసి నివేదికను ప్రభుత్వానికి అందించనున్నారు.

సర్వే వివరాలే ప్రామాణికం..

జిల్లాలో పురపాలికల్లో 4 వార్డులు, 4 గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి సేకరించిన సమాచారాన్నే అధికారులు ప్రామాణికంగా తీసుకోనున్నారు. వివరాలు నిర్ధారించుకొని వాటిని ఫారం-1లో నమోదు చేశారు. కుటుంబ సభ్యుల పేర్ల వివరాల్లో తప్పులుంటే సరిచేసి నమోదు చేసుకున్నారు. కుటుంబం అంగీకరిస్తే చిత్రం తీసుకున్నారు. ప్రభుత్వం నుంచి వచ్చిన సమాచారంతో కొన్ని కుటుంబాలకు సంబంధించిన వివరాలు లేకుంటే ఫారం-2లో నమోదు చేశారు. ఆన్‌లైన్‌లో సైతం తప్పిదాలకు తావులేకుండా ఉండేలా అనుభవమున్న ఆపరేటర్లను వినియోగించుకుంటున్నారు.

సర్వే చేపట్టిన వార్డులు, గ్రామాల వివరాలు

పుర/నియోజకరవ్గం	వార్డులు	మండలం	గ్రామం పేరు
సూర్యాపేట	37	పెన్‌పహాడ్	నాగులపహాడ్‌అన్నారం
కోదాడ	30	అనంతగిరి	యశ్వంతపురం
హుజూర్‌నగర్	04	పాలకీడు	రావిపహాడ్
తిరుమలగిరి(తుంగతుర్తి)	09	మద్దిరాల	రామచంద్రాపురం

ఆమె యజమాని..

కుటుంబంలో పురుషులను కాకుండా మహిళను యజమానిగా పేరు నమోదు చేశారు. ఆమెతో కుటుంబ సభ్యులకు ఉన్న బంధాన్ని పొందుపరిచారు. కుటుంబ సభ్యుల ఆధార్, చరవాణి నంబర్లు, పుట్టిన తేదీలు నమోదు చేసుకున్నారు. దీంతో ఆమె పేరుతో కుటుంబ సభ్యుల వివరాలతో ఆన్‌లైన్‌లో నమోదు చేసి కార్డు జారీ చేయనున్నారు.

పరిశ్రమలొస్తున్నాయ్..!

ఉమ్మడి జిల్లాలో విస్తరణ కోసం సర్కారుకు పలు కంపెనీల దరఖాస్తు

టీజీఐఐసీ ఆధ్వర్యంలో ఇప్పటికే పలు ప్రాంతాల్లో భూ సేకరణ పూర్తి

తలసరి ఆదాయానికి సూచికలుగా భావించే పారిశ్రామికీకరణలో భాగంగా.. ఉమ్మడి జిల్లాలో పలు పరిశ్రమలు భారీగా పెట్టుబడులు పెట్టడానికి సిద్ధమవుతున్నాయి. సున్నపురాయి నిక్షేపాలున్న కృష్ణపట్టి ప్రాంతంలో సిమెంటు పరిశ్రమలు విస్తరణకు ప్రభుత్వానికి ఇప్పటికే దరఖాస్తు చేసుకోగా.. రహదారి, రైలు, విమాన మార్గాలు అందుబాటులో ఉన్న రాజధాని సమీప ప్రాంతాల్లో ఫార్మా, పైపులు, ఇతర ఆహారశుద్ధి పరిశ్రమలను స్థాపించడానికి వ్యాపారవేత్తలు ఆసక్తి చూపిస్తున్నారు. - ఈనాడు, నల్గొండ

★ చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం సమీపంలోని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా హరిత పారిశ్రామిక పార్కులో ఇప్పటికే 300లకు పైగా పరిశ్రమలు ఉత్పత్తులు ప్రారంభించాయి. త్వరలోనే మరిన్ని కంపెనీలు తమ కార్యకలాపాలను ప్రారంభించడానికి కసరత్తు చేస్తున్నాయి. ఇటీవల ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్న వాటిలో పాలకవీడు మండలంలోని దక్కన్ సిమెంటు పరిశ్రమ రూ. 1218 కోట్లతో విస్తరించడంతో పాటూ 320 మందికి ఉపాధి అవకాశాలు ఇవ్వనున్నట్లు తెలిపింది. మేళ్లచెరువు మండలంలో మైం హోం సిమెంటు పరిశ్రమ రూ. 1500 కోట్లతో విస్తరించేందుకు ప్రణాళికలు రూపొందిస్తోంది. దీని వల్ల 500 మందికి ఉపాధి లభించనుంది.

★ మరోవైపు హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారి పక్కన నార్కట్‌పల్లి సమీపంలో రూ. 301 కోట్లతో మహారాష్ట్ర కేంద్రంగా పనిచేసే సీమ్‌లెస్ లిమిటెడ్ పైపుల తయారీ కంపెనీని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. దీని వల్ల 200 మందికి ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకుంటోంది. తొలి దశలో ఈ మూడు కంపెనీలు ఉమ్మడి జిల్లాలో రూ. 3,019 కోట్లతో 1020 మందికి ఉపాధి అవకాశాలు కల్పించనున్నాయి. మలిదశలో మరిన్ని ఆహారశుద్ధి పరిశ్రమలు దామరచర్ల, మిర్యాలగూడ, నల్గొండ, సూర్యాపేట ప్రాంతాల్లో స్థాపనకు ప్రభుత్వానికి దరఖాస్తులు సమర్పించనున్నట్లు తెలిసింది.

★ ప్రభుత్వం సదరు కంపెనీల దరఖాస్తులకు ఆమోదం తెలిపితే మెగా ప్రాజెక్టు కింద అవి వెచ్చించే పెట్టుబడిలో 30 శాతం రాయితీ లభించనుంది. భూ కేటాయింపుల్లో రాయితీతో పాటూ స్టాంప్, ట్రాన్స్‌ఫర్, రిజిస్ట్రేషన్ ఫీజులకు మినహాయింపు ఉంటుంది. వీటితో పాటూ విద్యుత్ సబ్సిడీ, వడ్డీ రాయితీలు సైతం షరతులతో వర్తిస్తాయి.

పారిశ్రామిక పార్కుల సంగతో..?

గత ప్రభుత్వ హయాంలో ఉమ్మడి జిల్లాలోని సూర్యాపేట, మిర్యాలగూడ, హుజూర్‌నగర్, మఠంపల్లి, చిట్యాలలో తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ (టీజీఐఐసీ) భూములను సేకరించింది. సూర్యాపేట, మిర్యాలగూడల్లో ఆటోనగర్ పేరిట భూములను సైతం సేకరించారు. మిర్యాలగూడ గ్రామీణ, దామరచర్ల మండలాల్లో ఆహారశుద్ధి పరిశ్రమలకు సైతం భూ సేకరణ ప్రక్రియ ప్రారంభమైంది. ఇప్పుడు వాటిల్లో కార్యకలాపాలు ప్రారంభిస్తే స్థానికులకు ఉపాధి అవకాశాలు దక్కేందుకు ఆస్కారం ఉంటుంది.

★ పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపిస్తున్న కంపెనీలతో పాటూ ప్రభుత్వ హయాంలో కంపెనీలు నెలకొల్పడానికి కేటాయింపులు చేసిన భూముల్లో కంపెనీలు నెలకొల్పి ఉత్పత్తులు ప్రారంభిస్తే యువతతో పాటూ స్థానికులకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు లభిస్తాయి. దీనిపైనా మూడు జిల్లాల అధికార యంత్రాంగాలు సమగ్ర సమాచారాన్ని సేకరిస్తున్నట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలిసింది.

నేడు జిల్లా స్థాయి బాస్కెట్‌బాల్ ఎంపిక పోటీలు

సూర్యాపేట పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం జిల్లా స్థాయి బాస్కెట్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు హఫీస్ ఖాన్, ఉపాధ్యక్షుడు పుట్టా కిశోర్, ప్రధాన కార్యదర్శి షేక్ ఫరూక్ గురువారం తెలిపారు. హైదరాబాద్‌లో ఈ నెల 14, 15, 16 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు. క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామీణ స్థాయి నుంచి ప్రతిభ గల క్రీడాకారులను గుర్తించి వారికి సరైన అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

వంద క్వింటాళ్ల నూకలు పట్టివేత

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: పీడీఎస్ బియ్యాన్ని సేకరించి రైస్ మిల్లులో ఇడ్లీ రవ్వగా తయారు చేస్తున్నారనే సమాచారంతో ఆత్మకూర్(ఎస్) మండలం పాతర్లపహాడ్ క్రాస్‌రోడ్డు వద్ద గల శ్రీలక్ష్మి రైస్ మిల్లును ఎస్సై వై. సైదులు, ఎస్బీ కానిస్టేబుల్ కిరణ్ గురువారం పరిశీలించారు. మిల్లులో పెద్ద రాసిగా పోసిన నూకలు, బియ్యాన్ని గుర్తించి పౌరసరఫరాల శాఖ అధికారులకు సమాచారం అందించారు. సూర్యాపేట పౌర సరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ నాగలక్ష్మి సిబ్బందితో వచ్చి రైస్‌మిల్లులో తనిఖీలు నిర్వహించారు. సుమారు వంద క్వింటాళ్ల నూకలు, ఒక క్వింటా పీడీఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. పంచనామా నిర్వహించి సాంకేతిక అధికారితో నూకలు, బియ్యం నమూనాలను సేకరించారు. ఆ నిల్వలను గోదాంకు తరలించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మిల్లు యజమాని కాసం రమేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


పాతర్లపహాడ్ క్రాస్‌రోడ్డు వద్ద గల రైస్‌మిల్లులో తనిఖీలు చేపడుతున్న పౌర సరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ నాగలక్ష్మి

దారంతా పూలవనమే బతుకమ్మ.. మాతోడు నువ్వుండి పోవే బతుకమ్మ..

మోతెలో బతుకమ్మల వద్ద మహిళల సందడి






నూతనకల్ మండలకేంద్రంలో సద్దుల బతుకమ్మ ఆడుతున్న మహిళలు

ఆత్మకూర్(ఎస్) మండలం కందగట్లలో తీరొక్క పూలతో..



ఆన్‌లైన్ లోకంలో.. ఆఫ్‌లైన్ కథలు



జానకీరామ్ రచించిన కథల పుస్తకం

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే: కోదాడ జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న ముక్కాముల జానకీరామ్ తెలుగు సాహిత్యంలో కవితలు, పాటలు, కథలు రాస్తూ అవార్డులు పొందుతున్నారు. నల్గొండ జిల్లా కేతేపల్లి మండలానికి చెందిన ఆయన ఆఫ్‌లైన్, ఏడు రంగుల వాన వంటి కథల పుస్తకాలు, 100కు పైగా కథలు రాశారు. ఇప్పటికే యూట్యూబ్‌లో మూడు పాటలు విడుదల చేశారు. తెలుగు రాష్ట్రాల్లో హైదరాబాద్ సారస్వత పరిషత్ వారు రచయితలకు నిర్వహించిన కథల పోటీల్లో అవార్డు సాధించారు. నేడు బాలల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్‌లోనే గడుపుతున్నారు. ఆన్‌లైన్‌కు దూరం చేయాలనే ఉద్దేశంతో 'ఆఫ్‌లైన్' కథల పుస్తకాన్ని రచించారు. చరవాణితో కలిగే నష్టాలను ప్రస్తావిస్తూ 22 కథలు రాశారు. 27 కథలతో 'ఏడు రంగుల వాన' పుస్తకాన్ని ప్రచురించారు. మేళ్లచెరువు ఉన్నత పాఠశాలలో పనిచేసే సమయంలో విద్యార్థులతో 33 కథలు రాయించి 'ఊహలకు రెక్కలొస్తే' అనే పుస్తకాన్ని ప్రచురించారు. ఇది సూర్యాపేట జిల్లాలోనే మొదటి బాలల కథల పుస్తకం.



- విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను, నైతిక విలువలను పెంపొందించడమే తన ఉద్దేశమని **జానకీరామ్** తెలిపారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, స్వీయరచనా సామర్థ్యాలను పెంపొందించడం, భావి రచయితలను సమాజానికి అందించడమే లక్ష్యంగా విద్యార్థులతో కథలు రాయిస్తున్నట్లు చెప్పారు.

ప్రభుత్వ విద్యను కాపాడేందుకు కృషి చేస్తా: అలుగుబెల్లి నర్సిరెడ్డి

నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యల పరిష్కారం కోసం.. ప్రభుత్వ విద్యను కాపాడేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి తెలిపారు. వరంగల్-నల్గొండ-ఖమ్మం ఉపాధ్యాయ శాసనమండలి అభ్యర్థిగా టీఎస్‌యూటీఎఫ్ రెండోసారి తన పేరు ప్రకటించడంతో గురువారం నల్గొండలోని జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీఎస్‌యూటీఎఫ్ కార్యకర్తలు, మద్దతు ఇచ్చే ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల నాయకులు కార్యకర్తలు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లను నమోదు చేయించేందుకు కృషి చేయాలని కోరారు. రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జంగయ్య, చావ రవి మాట్లాడుతూ అలుగుబెల్లి నర్సిరెడ్డి సేవలకు గుర్తింపుగా మరోసారి పోటీకి అవకాశం ఇచ్చినట్లు తెలిపారు. జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి బత్తుల సాయిలు, తెలంగాణ మోడల్ స్కూల్స్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కొండయ్య, తెలంగాణ పాలిటెక్నిక్ లెక్చరర్స్ అసోసియేషన్ ఎండీ.నజీముద్దీన్, విశ్రాంత ప్రొఫెసర్ అక్కెనపల్లి మీనయ్య, టీఎస్‌యూటీఎఫ్ మైనారిటీ గురుకుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు, శశిధర్, విజయ్, డా.శ్రీధర్‌కుమార్ లోథ్ తదితరులు అలుగుబెల్లి నర్సిరెడ్డికి మద్దతు ప్రకటించారు. టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాములు, నాగమణి, రాజశేఖర్‌రెడ్డి, సైదులు, వెంకటేశం పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, చావ రవి, జంగయ్య

బంధాలు గుర్తుంటే.. ప్రతిరోజూ పండగే

నాంపల్లి, న్యూస్‌టుడే:

తెలంగాణ ప్రజలకు అతి పెద్ద పండగ దసరా. . పండగ సెలవుల సందర్భంగా పట్టణాల్లో స్థిరపడిన కుటుంబాలు పల్లెబాట పడుతున్నాయి. పల్లె ప్రాంగణాల్లో కొంత సందడి నెలకొంటోంది. ఒకప్పుడు పండగ సెలవులు తాత, అమ్మమ్మ, నాయనమ్మ, మనుమలు, మనుమరాళ్ల కబుర్లతో ఎంతో సంతోషంగా గడిచేవి. అప్పటి రోజుల్లో పండగ వచ్చిందంటే పంట పొలాలు, చెరువుగట్లు, తోటల్లో చెట్ల కింద సేద తీరుతూ ప్రకృతి అందాలను ఆస్వాదించేవారు. నిండైన వెన్నెల కాంతుల్లో ఆరుబయట పిల్లలు.. పెద్దలూ కబుర్లతో కాలక్షేపం చేసేవారు. కాల క్రమేణా పండగలు కళను కోల్పోతున్నాయి. అందరూ కలిసినా ఎవరికి వారు ఒంటరిగా ఉంటూ సెల్‌ఫోన్లు.. కంప్యూటర్లతోనే గడుపుతున్నారు. నేటి ఈ ఆధునిక జీవన తీరు చూస్తుంటే పూర్వకాలంలోని అను'బంధాలు' గుర్తుచేసుకోక తప్పదు.

పండగ అంటే అయినవారం దరూ కలుసుకోవటం.. ఆనందాలను పంచుకోవటం.. గత స్మృతులను నెమరు వేసుకోవటం.. పది కాలాలపాటు పదిలపరుచుకునే మరిన్ని అనుబంధాలను మూటకట్టుకోవటం.. పండగ పూట ఇలాంటి మధురిమలు పొందాలంటే.. బంధుమిత్రులూ.. ఆత్మీయులందరితోనూ మమేకమవ్వండి.. పాలపిట్టను చూడండి... జమ్మిపూజలో పాల్గొనండి.. జ్ఞాపకాలను మదిలో పదిలపర్చుకోండి.. ఆ అనుబంధాలతో పంచుకున్న ఆనందమే పరిపూర్ణమైన దసరా పండగ..



దినపత్రికలు, పుస్తక పఠనంతో జ్ఞానసముపార్జన..

అంతర్జాలం పుణ్యామా అని దినపత్రికలు, పుస్తక పఠనం పూర్తిగా తగ్గిపోయింది. ఎంతసేపూ సెల్‌ఫోన్లు.. సామాజిక మాధ్యమాలను అనుసరించడానికి ఆసక్తి చూపుతున్నారు. వాటివల్ల అవగాహన స్థాయి పెరగదు.. అనుభూతి కలగదు.. జ్ఞాపకశక్తి పెంపొందదు. పైగా అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. అదే ఏదైనా ఓ మంచి పుస్తకం, దినపత్రికలు చదివితే కలిగే అనుభూతి వేరు. ఇటీవల దినపత్రికల్లోనూ చాలా మార్పులొచ్చాయి. సూటిగా, స్పష్టంగా తక్కువ వాక్యాల్లోనే కీలక విషయాలు, భావాలను చెబుతున్నాయి. వీటి వల్ల సామాజిక పోకడ అవగతమవుతుంది. వివేకం పెంపొందుతుంది. పండగ సెలవుల్లో సెల్‌ఫోన్ ప్రాధాన్యత తగ్గించండి. . పుస్తక పఠనంపై దృష్టి మరల్చండి.

ఆచరిస్తే.. ఆనందాలే..



పల్లెలకు వస్తున్న పిల్లలూ.. పెద్దలు.. దసరా సెలవులను తాతయ్య, అమ్మమ్మ, నాయనమ్మలతో ఆనందంగా గడపండి. పచ్చని పొలాలు, పంట కాల్వలు, పూల తోటల్లో విహరించి, ప్రకృతి అందాలను ఆస్వాదించండి. పల్లె ప్రకృతిని ఆకళింపు చేసుకోండి. పుట్టిపెరిగిన ఊరిని పరికించి, జన్మనిచ్చిన తల్లిదండ్రులను, వారిని కన్న పెద్దలనూ గుండెలకు హత్తుకోండి. ఉన్న వారం ఇంటిల్లిపాదితో సంతోషంగా గడిపి చక్కని అనుభూతి మూటకట్టుకోండి. ఇలాగైతే మునుపెన్నడూ లేని రీతిలో పండగ ఆనందాలు వెల్లివిరుస్తాయి..! ఆ జ్ఞాపకాలు గుర్తు చేసుకునే ప్రతి రోజూ పండగను తలపిస్తుంది.

బంధుమిత్రులతో కులాసా కబుర్లు..



ఈ కాలంలో అయిన వారితో కబుర్లు మాటలు, యోగక్షేమాలు, పలకరింపులు చరవాణికే పరిమితమయ్యాయి. వ్యక్తిగతంగా వారిని కలవడం, ఆనందాలను పంచుకోవడం పూర్తిగా తగ్గిపోయింది. దసరా పండగ సెలవు రోజుల్లో సాధ్యమైనంత వరకు చరవాణికి దూరంగా ఉండండి. గ్రామంలోని బంధుమిత్రులను కలవండి. ఆనందంగా వారితో గడపండి. ఆ జ్ఞాపకాలు మళ్లొచ్చే దసరా వరకు పదిలంగా ఉంచుకోండి.



విజేతలైన విద్యార్థులతో వారి తల్లిదండ్రులు

నయనానందం.. నృత్యాభినయం

కోదాడ, న్యూస్‌టుడే: ఈ రోజుల్లో పిల్లలు పాఠశాలలకు వెళ్లి విద్య నభ్యసించాలంటేనే బద్ధకంగా ఉంటారు. కానీ కోదాడ విద్యార్థులు చదువులో రాణిస్తూ ప్రపంచ రికార్డులు సాధిస్తున్నారు. ఇటీవల అంతర్జాతీయ కల్చరల్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్, కాశీ విశ్వనాథుడి దేవాలయ కమిటీ నిర్వాహకులు, తమిళనాడు ప్రభుత్వ సంయుక్తంగా పోటీలు నిర్వహించారు. పోటీల్లో ఉమ్మడి జిల్లా నుంచి 15 మంది పాల్గొని ప్రపంచ రికార్డులు సాధించడం విశేషం.



రెండు నెలలు కష్టపడ్డాం: పోతుగంటి తపస్య

పోటీల కోసం రెండు నెలల పాటు కష్టపడ్డాం. నిత్యం సాధన చేసి విజయం సాధించాం. ఆన్‌లైన్ విధానంలో ప్రదర్శన చేసిన తర్వాత కూడా నమ్మకం లేదు. పోటీల అనంతరం అవార్డులు రావడంతో ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి.

15 మంది.. 12 రికార్డులు..

భరతనాట్యంలో భాగంగా రావణాసురుడు రచించిన రావణాకృత శివతాండవ స్తోత్రం అనే నృత్య పోటీలను మొదటిసారి నిర్వహించారు. పోటీల్లో భాగంగా ఆన్‌లైన్ విధానంలో 8 నిమిషాల పాటు నృత్యం చేయాల్సి ఉంటుంది. సుమారు 10 వేల మంది పాల్గొన్నారు. కోదాడకు చెందిన నాట్య గురువు తిరుపతి స్వామి శిష్య బృందం నుంచి 15 మంది పాల్గొని ప్రపంచ రికార్డు సృష్టించారు. వీరందరూ నృత్యంలో ప్రతిభ కనబరచడంతో కాశీ విశ్వనాథుడి దేవాలయం, తమిళనాడు ప్రభుత్వం నుంచి అవార్డులు రావడంతో పాటు 12 ప్రపంచ రికార్డులు సాధించారు.

అవార్డులు రావడం ఆనందంగా ఉంది:

సోమా వెంకటశ్లోక



కొన్నేళ్లుగా కోదాడ పట్టణంలో భరతనాట్యం, శాస్త్రీయ నృత్యాలు నేర్చుకుంటున్నాం. మొదటిసారి కాశీ విశ్వనాథుడి ఆలయం వారు నిర్వహించిన పోటీల్లో పాల్గొని, మెరుగైన ప్రదర్శన ఇచ్చాం. అవార్డులు సాధించడం ఆనందంగా ఉంది. దీంతో భరతనాట్యంలో మరింత ఎత్తుకు ఎదగాలని ఉంది.



రోజుకు రెండు గంటలపాటు సాధన: యర్రంశెట్టి శ్రేష్ఠ

నిత్యం పాఠశాలకు వెళ్తూనే రోజుకు రెండు గంటల పాటు భరతనాట్యం నేర్చుకుంటున్నా. ఎనిమిది నిమిషాల పాటు ఆన్‌లైన్ విధానంలో ప్రదర్శన చేయాలంటే మొదట్లో భయమేసింది. కానీ మెరుగైన ప్రదర్శన ఇవ్వడంతో పలు రికార్డులు రావడం ఆనందానిచ్చింది.


మధురం.. సీతాఫలం



తుర్కపల్లి, న్యూస్‌టుడే: సీతాఫలం మార్కెట్లోకి వచ్చేసింది. సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు వరకు ఇవి సమృద్ధిగా లభిస్తాయి. ప్రకృతిలో సహజ సిద్ధంగా లభిస్తాయి. ప్రతిఏటా ఈ పండ్లకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో ఆయా ప్రాంతాలలో తోటలు పెట్టి కూడా పండిస్తున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా సీతాఫలాలకు ప్రసిద్ధి. ప్రధానంగా తుర్కపల్లి, బొమ్మలరామారం, రాజపేట, భువనగిరి, బీబీనగర్, ఆత్మకూరు, యాదగిరగుట్ట, వలిగొండ ప్రాంతాల నుంచి సీతాఫలాలు పట్టణాలకు ఎగుమతి అవుతుంటాయి.

★ వర్షాకాలంలో రైతులు సీతాఫలాల విక్రయంతో ఉపాధి పొందుతూ ఉంటారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో పక్షం రోజుల నుంచి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. రైతుల నుంచి వ్యాపారులు కొనుగోలు చేసి పట్టణాలకు తరలిస్తున్నారు. గంప సైజుని బట్టి రూ.100 నుంచి రూ.500 వరకు విక్రయిస్తున్నారు. యాదాద్రి జిల్లాతో పాటు సరిహద్దు ప్రాంతమైన సిద్దిపేట జిల్లా గజ్వేల్, జగదేవ్‌పూర్, మర్కుక్ ప్రాంతాల నుంచి కూడా వ్యాపారులు పండ్లను కొనుగోలు చేసి వాహనాలలో తుర్కపల్లి మండలం మీదుగా జిల్లా కేంద్రంతో పాటు ఇతర ముఖ్య పట్టణాలకు తరలిస్తున్నారు.

అంతరిస్తున్న వృక్షాలు... రియల్ వ్యాపారం కారణంగా సీతాఫలం వృక్షాలు తగ్గిపోతున్నాయి. దిగుబడి కూడా ఏటా తగ్గిపోతోంది. పండ్లను అధిక ధరలు పెట్టి కొనుకోవాల్సి వస్తోంది.ఏటా సీతాఫలాల మాధుర్యాన్ని ఆస్వాదించే వారికి వృక్షాలు కనుమరుగవుతుండటాన్ని జీర్ణించుకోలేక పోతున్నారు. ఒకప్పుడు గుట్టల్లో, చెలకల్లో ఎక్కడ పడితే అక్కడ సీతాఫలం వృక్షాలు కనిపించేవి. దారిన వెళుతుంటే ఎంతో సువాసనవచ్చేవి. ఇప్పుడు దారుల వెంట వృక్షాలు కనిపించడం లేదు. భావి తరాల కోసం వృక్షాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రైతులు అభిప్రాయపడుతున్నారు.



ధైర్యలక్ష్మిగా పద్మావతి అమ్మవారు

భువనగిరి, న్యూస్‌టుడే: భువనగిరి స్వర్ణగిరి క్షేత్రంలో దసరా శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఎనిమిదో రోజైన గురువారం శ్రీపద్మావతి అమ్మవారు ధైర్యలక్ష్మీ అలంకరణలో దర్శనమిచ్చారు. సహస్రదీపాలంకార సేవలో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

దేవీ నవరాత్రోత్సవాల్లో అలంకార సంబరం

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి పుణ్యక్షేత్రంలోని అనుబంధ శివాలయంలో కొనసాగుతున్న శ్రీ దేవీ నవరాత్రోత్సవాల్లో భాగంగా గురువారం దుర్గాదేవి అలంకరణ జరిపి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలంకార సంబురాలతో పాటు, లలితా సహస్రనామార్చన జరిపారు.



ఒక రోజు కస్టడీకి అనుమతి

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: ప్రభుత్వ భూమిని నిబంధనలకు వ్యతిరేకంగా ఇతరుల పేర్ల మీదకు మార్పిడి చేసి రైతుబంధు నిధులు కాజేసిన కేసులో అరెస్టయిన అప్పటి హుజూర్‌నగర్ తహసీల్దార్ జయశ్రీని విచారించేందుకు పోలీసులు ఐదు రోజుల కస్టడీ కోరగా.. హుజూర్‌నగర్ జూనియర్ సివిల్ జడ్జి మారుతి ప్రసాద్ ఒకరోజు కస్టడీకి అనుమతించారు. తాము అరెస్టు చేసిన సమయంలో జయశ్రీ పూర్తిగా సహకరించనందున అన్ని వాస్తవాలు తెలుసుకునేందుకు ఐదు రోజులు కస్టడీకి అనుమతించాలని కోరుతూ హుజూర్‌నగర్ పోలీసులు గురువారం పిటిషన్ వేశారు. అదే విధంగా జయశ్రీకి బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఆమె తరపున న్యాయవాది బెయిల్ పిటిషన్ వేశారు. న్యాయమూర్తి మొదట పోలీస్ కస్టడీ పిటిషన్‌పై వాదనలు విన్నారు. అనంతరం ఐదు రోజుల కస్టడీ కాకుండా ఒక రోజు కస్టడీకి అనుమతిస్తూ జడ్జి ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 11న ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు విచారణకు అనుమతించారు. పోలీస్ కస్టడీకి అనుమతించినందున బెయిల్ పిటిషన్ వాయిదా వేశారు. కోర్టుకు రెండు రోజులు సెలవులు ఉండటం వల్ల బెయిల్ పిటిషన్‌పై వాదనలు సోమవారం జరిగే అవకాశం ఉంది.

సీపీఎం నేత సీతారాములుకు మాతృవియోగం



సీతారాములు తల్లి లక్ష్మమ్మ మృతదేహంపై పూలమాలవేసి నివాళి అర్పిస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి

చిట్యాల, న్యూస్‌టుడే: సీపీఎం కేంద్రకమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు తల్లి లక్ష్మమ్మ(96) వృద్ధాప్యంతో గురువారం హైదరాబాద్‌లోని నివాసంలో మరణించారు. లక్ష్మమ్మ అంత్యక్రియలు నల్గొండ జిల్లా చిట్యాలలో నిర్వహించారు. లక్ష్మమ్మ మృతదేహాన్ని సందర్శించడానికి వచ్చిన తన చిరకాల మిత్రుడు, శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిని చూడగానే సీతారాములు భావోద్వేగానికి లోనై ఏడ్చారు. లక్ష్మమ్మ మృతదేహానికి నివాళులర్పించిన వారిలో సుఖేందర్‌రెడ్డితోపాటు ఎమ్మెల్యే వేముల వీరేశం, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, వ్యకాసం జాతీయ కార్యదర్శి బి.వెంకట్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి, నల్గొండ, యాదాద్రిభువనగిరి జిల్లాల కార్యదర్శులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, ఎండీ అక్బర్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఉన్నారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	109-00
రిటైల్	131-00
డ్రెస్డ్	190-00
స్కిన్‌లెస్	216-00

వ్యర్థాలలో.. అర్థం వెతికి..!

చౌటుప్పల్, న్యూస్‌టుడే: మనం సౌకర్యం కోసం ప్లాస్టిక్ చేతిసంచులు వాడి అవసరం తీరగానే అవతల పారేస్తాం. నీళ్ల సీసా కొనుక్కుని తాగి అవతలికి విసిరేస్తాం. దుకాణం నుంచి పాలు, నూనె ప్యాకెట్లు తెచ్చి ఖాళీ కాగానే చెత్త కుండీలో వేసేస్తాం. ఇళ్లలో వాడేందుకు ప్లాస్టిక్ బకెట్లు, కుర్చీలు కొంటాం. ఈ ప్లాస్టిక్ వ్యర్థాలన్నీ ఏమవుతున్నాయి? వందల ఏళ్లయినా పాడైపోవు, కుళ్లిపోవు, మట్టిలో కరిగిపోవు. ఈ ప్లాస్టిక్ వ్యర్థాలతోనే వ్యాపారం చేయవచ్చునని ఆలోచించారు కొయ్యలగూడానికి చెందిన చేనేత కార్మికుడు రాపోలు సైదులు, అతని భార్య కవిత. చౌటుప్పల్‌లో వీరి కుమార్తె అనూహ్య పేరిట 'అను ప్లాస్టిక్స్' పద్నాలుగేళ్ల క్రితం ప్రారంభించారు. ప్లాస్టిక్ వ్యర్థాలను వీరు రోజుకు వెయ్యి కిలోలు చొప్పున ఇప్పటికి 50 లక్షల 40 వేల కిలోలు సేకరించారు. వాటిని యంత్రాల్లో వేసి గ్రైండింగ్, ప్రెస్సింగ్ చేసి పునరుత్పత్తి కేంద్రాలకు తరలించారు. పర్యావరణానికి ఎంతో మేలు చేసే ఈ వ్యాపారంతో ప్రత్యక్షంగా ఎనిమిది మందికి, పరోక్షంగా 30 మందికి ఉపాధి కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. వీరి సేవకు గుర్తింపుగా స్వచ్ఛ సర్వేక్షణ్-2023లో పురపాలిక ద్వారా ప్రశంసాపత్రాన్ని అందించి సన్మానించారు.

మాకు ఉపాధి...పర్యావరణానికి మేలు

– రాపోలు సైదులు, కవిత, కొయ్యలగూడెం

మా నాన్న రాపోలు నర్సింహ దగ్గర చేనేత పని నేర్చుకున్నా. పేదరికం వల్ల పదో తరగతి పూర్తి కాగానే చదువు మాన్పించి మగ్గం నేయడానికి కుదురుకున్నా. పద్నాలుగేళ్ల పాటు మగ్గంపై నేత పని చేశాను. వస్త్రాలు అమ్ముడుపోక పని దొరకడం కష్టమైంది. అప్పటికే ముగ్గురు సంతానం. చేనేత వృత్తి పనిని వదిలేశాను. నా బావమర్ది శ్రీనివాస్ ప్లాస్టిక్ వ్యర్థాలతో వ్యాపారం చేయవచ్చని ఆలోచన చెప్పాడు. రూ.ఆరు లక్షలతో ప్లాస్టిక్ గ్రైండింగ్, ప్రెస్సింగ్ చేసే యంత్రాలు కొనుగోలు చేసి తెచ్చాం. సుమారు 30 మంది నిత్యం ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరి సుమారు వెయ్యి కిలోల వరకు మా దగ్గరికి తీసుకొచ్చి అమ్ముతున్నారు. వారికి రోజూ సగటున రూ.300 ఆదాయం వస్తుంది. మా షెడ్డులో ఆరుగురిని ఉద్యోగులుగా నియమించుకున్నాం. వాళ్లతో మేము కొనుగోలు చేసిన ప్లాస్టిక్ వ్యర్థాలను కవర్లు, నీళ్ల సీసాలు, మందంగా ఉండే డబ్బాలు, కుర్చీలు, టేబుళ్లు ఇలా 21 రకాల ప్లాస్టిక్ వ్యర్థాలను రంగుల వారీగా వేరు చేయిస్తాం. నీళ్ల సీసాలను ప్రెస్సింగ్ చేస్తాం. ఇతర ప్లాస్టిక్ వ్యర్థాలను రకం, రంగుల వారీగా గ్రైండింగ్ మిషన్‌లో చిప్స్ మాదిరిగా ముక్కలు చేసి సంచుల్లో నింపుతాం. వీటిని హైదరాబాద్ కాటేదాన్‌లో రీసైక్లింగ్ చేసే కంపెనీలకు సరఫరా చేస్తున్నాం. దీంతో మాకు స్వయం ఉపాధి లభిస్తుంది. ఇతరులకు ఆదాయం లభిస్తుంది. పర్యావరణానికి మేలు జరుగుతుంది. ఈ వ్యాపారంతోనే మా ముగ్గురు పిల్లలను ఇంజినీరింగ్, డిగ్రీ విద్య చదివిస్తున్నాం.



తాగి పడేసిన ప్లాస్టిక్ నీళ్ల సీసాలను యంత్రంతో ప్రెస్సింగ్ చేస్తున్న రాపోలు సైదులు, కవిత దంపతులు

నేడు బండ్ల పండగ

మునగాల, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని కనకదుర్గ అమ్మవారి బండ్ల పండగను శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వెంకటరెడ్డి తెలిపారు. అమ్మవారి ఆలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బతుకమ్మ ప్రభబండ్లను కట్టి గురువారం రాత్రి పురవీధుల్లో ఊరేగింపుగా బయలుదేరి శుక్రవారం ఉదయం ఆలయానికి చేరుకోనున్నట్లు చెప్పారు. ఆలయ అర్చకులు ప్రశాంతాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని, భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటారని పేర్కొన్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ప్రతాపరెడ్డి, రామిరెడ్డి, జానకిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కోదాడ

• కోదాడ • హుజూర్‌నగర్

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే:

? పట్టణంలోని విష్ణురామ్ థియేటర్ ఎదురు బజారులో వీధి దీపాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. –ఎస్.హెచ్.రావు, కోదాడ

✔ పరిశీలించి వెంటనే వీధి దీపాలు అమర్చుతాం. –నాగరాజు, పుర ఎలక్ట్రీషియన్, కోదాడ

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) 80085 50363 96030 18889

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే:

? హుజూర్‌నగర్ కామిశెట్టి నగర్ కాలనీ బోర్డు ముందు వీధి లైట్లు వెలగడం లేదు. పాములు అధికంగా తిరుగుతున్నాయి. తిరుపతయ్య, హుజూర్‌నగర్

✔ పరిశీలించి వెంటనే లైట్లు వేయిస్తాం. –యాకుబ్‌పాషా, పుర కమిషనర్, హుజూర్‌నగర్

ప్రకృతి వనాలపై పట్టింపేది..?

మునగాల, న్యూస్‌టుడే: పల్లెల్లో సైతం పార్కులను అందుబాటులోకి తీసుకురావాలని గత ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించి ప్రకృతి వనాలను ఏర్పాటుచేసింది. సందర్శకులు, ప్రకృతి ప్రేమికులతో సందడిగా ఉండే



పల్లె ప్రకృతి వనంలో పెరిగిన పిచ్చి మొక్కలు

ప్రకృతి వనాలు నిర్వహణ లోపంతో వెలవెలబోతున్నాయి. అన్నిరకాల వసతులు, పూల మొక్కలతో కళకళలాడాల్సిన వనాలు కళావిహీనంగా మారాయి. అధికారులు పట్టించుకోకపోవడంతో పిచ్చిమొక్కలు నిలయాలుగా, పలు గ్రామాల్లో మందుబాబులకు అడ్డాలుగా మారాయి.

❒ మండల వ్యాప్తంగా 22 గ్రామపంచాయతీల్లో అధికారులు ప్రకృతి వనాలు ఏర్పాటు చేశారు. ఈజీఎస్ నిధులతో మొదటి రెండు సంవత్సరాలు అధికారులు పనులు చేయించారు. తర్వాత గ్రామ పంచాయతీలకు అప్పగించారు. పల్లె ప్రకృతి వనాల్లో వాకింగ్ ట్రాక్‌తో పాటు, ఔషధ మొక్కలు, వివిధ రకాల పూలమొక్కలు ప్రస్తుతం ఏపుగా పెరిగాయి. ఇటీవల కురిసిన వర్షాలకు వాకింగ్ ట్రాక్ పూర్తిగా కనుమరుగయ్యాయి. వనాల్లో పిచ్చి మొక్కలు పెరిగి వనాలు నిరుపయోగంగా ఉన్నాయి. చెత్తాచెదారం పేరుకుపోవడంతో సర్పాలు లోపలకు వస్తున్నాయి. ప్రకృతి వనాలను శుభ్రం చేయించి వాటికి పూర్వ వైభవం తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం: రమేష్ దీనదయాల్, ఎంపీడీవో

పల్లె ప్రకృతి వనాల బాధ్యతను ప్రస్తుతం గ్రామపంచాయతీలు చూస్తున్నాయి. వర్షాకాలం కావడంతో పిచ్చి మొక్కలు ఎక్కువగా పెరిగాయి. గ్రామాల వారీగా ప్రకృతి వనాలను పరిశీలించి, వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకుంటాం.

సద్దుల సంబరం



కోదాడలో చైర్‌పర్సన్ సామినేని ప్రమీల, నూనె సులోచన, తదితరులు



హుజూర్‌నగర్ పురపాలక సంఘంలో వైస్ చైర్మన్ సంపత్‌రెడ్డి, కమిషనర్ యాకుబ్‌పాషా, మహిళా కౌన్సిలర్లు, సిబ్బంది



నేరేడుచర్ల శివాలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



వేపలసింగారంలో..



కోదాడ పట్టణంలో బతుకమ్మలతో మహిళలు

తీరొక్క పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలతో ఊరూరా గురువారం సద్దుల బతుకమ్మ పండగను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. మహిళలు పోటీ పడి ఒకరిని మించి మరొకరు పెద్ద బతుకమ్మలను అందంగా పేర్చి అలంకరించి భక్తిని చాటుకున్నారు. గ్రామంలోని మహిళలంతా బతుకమ్మలతో ఒకచోట చేరి ఆడిపాడి సద్దిని తోటి మహిళలతో పంచుకున్నారు. న్యూస్‌టుడే బృందం:



మేళ్లచెరువులో..



చిలుకూరు మండలం నారాయణపురంలో..



ఎల్లాపురంలో బతుకమ్మలతో మహిళలు



పొనుగోడులో..



కోదాడలో..



మునగాలలోని శ్రీరామలింగేశ్వర హనుమాన్ దేవాలయంలో..



నడిగూడెం శ్రీకోదండరామాలయంలో..

అనుమతి లేకుండా..
అక్రమంగా డీజిల్ అమ్మకం

కోదాడ, న్యూస్‌టుడే: సరైన అనుమతులు లేకుండా డీజిల్ బంకు ఏర్పాటు చేసి అక్రమంగా విక్రయిస్తూ పౌరసరఫరాల అధికారులకు పట్టుబడిన ఘటన కోదాడ పట్టణంలో గురువారం చోటు చేసుకుంది. పౌరసరఫరాల అధికారుల కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలానికి చెందిన బిక్షం నాయక్ కన్స్యూమర్ డీజిల్ బంకును పట్టణంలో ఏర్పాటు చేసి కొంత కాలంగా డీజిల్ విక్రయిస్తున్నారు. విషయం తెలుసుకున్న ఏఎస్‌వో శ్రీనివాస్‌రెడ్డి గురువారం తనిఖీ చేశారు. బీ ఫాం, ఫైర్ సేఫ్టీ, ఇతర అనుమతులు లేవని, బంకు రీడింగ్ రికార్డు చేసి డీజిల్ విక్రయించొద్దని నోటీసులు జారీ చేశారు. అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోవాలని, ఇదే విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు చేపడతామని ఆయన తెలిపారు. అంతకుముందు అన్ని అనుమతులు ఉన్నాయని నిర్వాహకులు, అనుమతులు లేవని అధికారుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది.

అందజేత

మునగాల: గౌడ కులస్థులు ఐక్యంగా హక్కులకు పోరాడాలని ఆ సంఘం మండల నాయకుడు శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని శ్రీ కంఠమహేశ్వర స్వామి దేవాలయంలో టీఎఫ్టీ కింద నూతనంగా మంజూరు చేసిన లైసెన్సులు, ఐడీ కార్డులను లబ్ధిదారులకు గురువారం అందజేశారు.

సత్కారం

హుజూర్‌నగర్ గ్రామీణం: పట్టణంలోని 17వ వార్డు మటన్ మార్కెట్ సెంటర్‌లో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన బతుకమ్మ ఉత్సవాల్లో జబర్దస్త్ కళాకారులు వినోదిని, మోహన్, శాంతి స్వరూప్ పాల్గొన్నారు. కళాకారులను రాంబాబు, అమర్‌గౌడ్ సత్కరించారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై నిరంతర ఉద్యమం

చిలుకూరు, న్యూస్‌టుడే: ప్రజావ్యతిరేక విధానాలపై సీపీఎం నిరంతరం ఉద్యమాలు నిర్వహిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు మల్లు నాగార్జునరెడ్డి అన్నారు. మాధవగూడెంలో నిర్వహించిన పార్టీ మండల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంటలు దెబ్బతిన్న రైతులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. మహిళలకు ఉచిత ప్రయాణం అన్నారు గానీ గ్రామాలకు బస్సులు రావడం లేదని విమర్శించారు. మండలానికి పాలిటెక్నిక్ కళాశాల, జూనియర్ కళాశాలలను మంజూరు చేయాలన్నారు. అనంతరం పార్టీ మండల కార్యదర్శిగా చినరాములును ఏకగ్రీవంగా రెండోసారి ఎన్నుకున్నారు. పార్టీ నాయకులు వెంకటేశ్వరావు, నరసింహారావు, వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దేవతామూర్తులపై సూర్యకిరణాలు



నేరేడుచర్ల, న్యూస్‌టుడే: నేరేడుచర్ల మండలం కల్లూరు గ్రామంలోని కోదండరామాలయంలో గురువారం సీతారామలక్ష్మణులపై సూర్యకిరణాలు ప్రసరించాయి. దక్షిణాయణంలో అక్టోబరు మాసంలో ప్రతి ఏడాది 6వ తేదీ నుంచి 12వ తేదీ వరకు, ఉత్తరాయణంలో సంక్రాంతి సమయంలో గర్భగుడిలోని దేవతామూర్తులపై సూర్యకిరణాలు ప్రసరిస్తాయని ఆలయ అర్చకుడు రాఘవశర్మ తెలిపారు. వాస్తు ప్రకారం నిర్మాణం జరిపిన ఆలయాల్లో ఇలా ప్రసరిస్తాయని చెప్పారు.

పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా ఎన్నిక

మోతె, న్యూస్‌టుడే: పీఆర్టీయూ 35వ రాష్ట్ర మహాసభలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా చెన్నుపాటి శ్రీనివాసరెడ్డి, కొత్తపల్లి రాంరెడ్డి, గోపగాని గిరిగౌడ్‌లు ఎన్నికైనట్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షులుగా మామిడి శ్రీను, సోమ సురేష్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శులుగా లక్కపాక ప్రవీణ్‌కుమార్, శ్రీవాణి ఎన్నికయ్యారు. వీరి ఎన్నికకు సహకరించిన మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటరెడ్డి, కిరణ్‌కుమార్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జితేందర్ రెడ్డి, నరేష్‌లకు అభినందనలు తెలిపారు.



శ్రీనివాసరెడ్డి



రాంరెడ్డి



గిరిగౌడ్

ప్రకృతి సాగుపై క్షేత్ర ప్రదర్శన

నడిగూడెం, న్యూస్‌టుడే: తెలంగాణ వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి ఆధ్వర్యంలో సీఎం సలహాదారు చంద్రశేఖర్‌రెడ్డి, నడిగూడెం ఏవో దేవప్రసాద్, ప్రకృతి సాగు సమన్వయకర్త ఎం.గోపయ్య అభ్యుదయ రైతు శేషకుమార్‌లు ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో సాగవుతున్న ప్రకృతి వ్యవసాయంపై గురువారం క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. అక్కడి ప్రభుత్వం రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న ప్రకృతి సాగు ప్రాజెక్టు గురించి స్థానిక అధికారులు వివరించినట్లు ఏవో చెప్పారు. గుంటూరు జిల్లా తెనాలి ప్రాంతాల్లో వరి, పత్తి క్షేత్రాలను సందర్శించామన్నారు.

జ్ఞాపకాలు గుర్తు చేసుకొని..!

హుజూర్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: లింగగిరిలోని శాంతి విద్యానికేతన్ ఉన్నత పాఠశాలలో 2012-13 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు



నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

గురువారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. పూర్వ విద్యార్థులు గురువులతో కలిసి అలనాటి మధుర స్మృతులను నెమరు వేసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకొని ఆనందంగా గడిపారు. పాఠశాల వ్యవస్థాపకుడు శ్రీనివాసాచారి, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

సినిమాలు కోదాడ పట్టణం, న్యూస్‌టుడే:

విష్ణురామ్: దేవర, విశ్వం, మా నాన్న సూపర్‌హీరో, వేట్టయన్, **శ్రీనివాస:** దేవర, **కాన్‌ప్లెక్స్:** వేట్టయన్, విశ్వం, మానాన్న సూపర్ హీరో, **రంగా:** వేట్టయన్, **వెంకటేశ్వర:** విశ్వం

వరి.. వర్షానికి నేలవాలి



మోతె: విభళాపురం పరిధిలో నేలవాలిన వరి

మోతె, న్యూస్‌టుడే: ఈ వానాకాలం సీజన్ ఆసాంతం ప్రకృతి ప్రకోపానికి అన్నదాత అతలాకుతలం అవుతున్నాడు. ఏపుగా ఎదిగిన వరి పొలాలు గురువారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షానికి నేలకరిచాయి. మండలంలో అరగంట పాటు జోరుగా కురిసిన వర్షం అన్నదాతకు ఒకింత ఆవేదనే మిగిల్చింది. ఈ వర్షం వరి కంకులతో కళకళలాడుతున్న పొలాలను పొట్టన పెట్టుకుంది. వర్షంతో పాటు గాలి జోరుగా వీయడంతో కంకులతో తల బరువున్న పైరంతా చాప చుట్టినట్లు నేల పరుచుకుంది. అనేక ఎకరాల్లో చేతికి అందివచ్చిన వరిపంట ఇలా అరగంటలోనే చాప చుట్టుకుపోవడంతో తీవ్ర నష్టం సంభవించిందని విభళాపురం, రాంపురంతండా తదితర గ్రామాల రైతులు ఆవేదనకు గురవుతున్నారు.

అనంతగిరి: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం వర్షం పడటంతో చాలా వరకు పొలాలు దెబ్బతిన్నాయి. మరో 15 రోజుల్లో వరి చేతికొస్తుంది. ఈ దశలో వర్షాలు పడటంతో రైతులకు తీరని నష్టం జరుగుతుంది. చనుపల్లి గ్రామానికి చెందిన దన్వంతరెడ్డి 6 ఎకరాలు సాగు చేయగా, వరి నేలకొరగడంతో దిగుబడి అమాంతం తగ్గుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఇలా చాలా మంది రైతులు వర్షాలకు బిక్కుబిక్కుమంటూ గడపాల్సిన దుస్థితి నెలకొంది.



చనుపల్లి గ్రామంలో కోత దశలో నేలకొరిగి ఇలా

నీటి వృథా.. అధికారుల పరిశీలన

నేరేడుచర్ల, న్యూస్‌టుడే: పెంచికల్‌దిన్న చెరువు అలుగు వద్ద బుంగతో నీటి వృథా జరుగుతోందని మత్స్యసహకార సంఘం సభ్యులు, గ్రామస్థులు గుర్తించి



బుంగను పరిశీలించి ఉన్నతాధికారులతో మాట్లాడుతున్న నీటిపారుదలశాఖ ఏఈ రాజేశ్వరి

ఇసుక బస్తాలతో కొంత మేర నీటి వృథాను ఆపగలిగారు. నీటిపారుదలశాఖ అధికారులకు సమాచారం అందించారు. నీటిపారుదలశాఖ ఏఈ రాజేశ్వరి గురువారం బుంగను పరిశీలించి ఉన్నతాధికారులకు సమాచారం అందజేశారు. చెరువులో నీరు నిండుగా ఉన్నందున ఇప్పుడు మరమ్మతులు చేసే అవకాశం లేనందున బుంగ ద్వారా నీటి వృథా జరగకుండా ఇసుక బస్తాలు పూర్తిస్థాయిలో వేయిస్తామని ఆమె చెప్పారు. వేసవిలో పూర్తిస్థాయి మరమ్మతులు చేయిస్తామన్నారు.

రహదారి కోత.. ప్రయాణానికి వెత



రాఘవపురం వద్ద శిథిలమైన రహదారి

పాలకవీడు గ్రామీణం, న్యూస్‌టుడే: ఇటీవల కురిసిన వానలకు భారీ స్థాయిలో వరదలు రావటంతో మండలంలో పలు చోట్ల రహదారులు దెబ్బతిన్నాయి. మఠంపల్లి నుంచి జాన్‌పహాడ్ దర్గా మీదుగా నల్గొండ జిల్లా దామరచర్లకు వెళ్లే దారి గుంతలమయంగా మారింది. రాఘవపురం వద్ద వరద రహదారి పైనుంచి ప్రవహించటంతో రహదారి అంచు పూర్తిగా ధ్వంసం అయింది. మట్టి కట్ట పూర్తిగా కొట్టుకుపోవటంతో నాలుగు అడుగులు లోతుగా గొయ్యిలా మారింది. రోజూ పదుల సంఖ్యలో సిమెంటు రవాణా, ఇతర భారీ వాహనాలు ఈ దారి నుంచే నల్గొండ జిల్లాకు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చేరుకొంటాయి. పాదచారులు నడిచే బాట పూర్తిగా శిథిలం కావటంతో ఎదురుగా వచ్చే వాహనాలకు దారి ఇవ్వటానికి పక్కకు దిగితే ఎక్కడ వాహనాలు బోల్తా పడతాయోనని చోదకులు ఆందోళన చెందుతున్నారు. రాత్రి వేళల్లో, వర్షం కురిసే సమయాల్లో దారి సరిగా కనిపించకపోవడంతో ప్రమాదాలకు ఆస్కారం ఉందని వాహనచోదకులు వాపోతున్నారు. శిథిలమైన రహదారికి తక్షణం మరమ్మతులు చేయాలని, అప్పటివరకు ఆ ప్రాంతంలో రక్షణ సూచికలు ఏర్పాటు చేయాలని జనం కోరుతున్నారు. ఈ విషయంపై ఆర్అండ్‌బీ డీఈ రమేశ్‌ను వివరణ కోరగా వరద నష్టంపై ఉన్నతాధికారులకు నివేదికలు పంపామని, నిధులు మంజూరు కాగానే పనులు చేపట్టి సమస్యను తొలగిస్తామన్నారు.

నడిగూడెం, న్యూస్‌టుడే: ఇటీవల కురిసిన వర్షాలు, వరదలకు నడిగూడెం నుంచి రత్నవరం వరకు ఉన్న రోడ్లు భవనాల శాఖ రహదారి పలు చోట్ల కోతకు గురైంది. సాగర్ వారధి మూల మలుపులో రహదారి నాలుగు అడుగుల మేరకు కోతకు గురై గండి పడింది. కేవలం ఒక వాహనం వచ్చే మందమే రహదారి ఉంది. దీనిపై ప్రమాదకరంగా వాహనాలు ప్రయాణిస్తున్నాయి. ఇక్కడ ఎదురెదురుగా వాహనాలు వచ్చినా, వాహనం ఏ మాత్రం అదుపు తప్పినా గోతిలో పడిపోవాల్సిందే.



కోతకు గురైన నడిగూడెం-రత్నవరం రహదారి

రోడ్డు కోతకు గురై నెల రోజులు దాటినా నేటికీ రహదారి దిద్దుబాటు చర్యలు చేపట్టకపోవడంతో పలు గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పది గ్రామాల ప్రజలు నడిగూడెం మండల కేంద్రానికి చేరుకోవడానికి ఇదే ప్రధాన రహదారి. నడిగూడెం-అనంతగిరి మండలాలను కలిపే ప్రధాన రహదారి కూడా. అయినప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి మరమ్మతు పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. కోతకు గురైన రహదారుల మరమ్మతులకు ప్రతిపాదనలు పంపామని, నిధులు మంజూరు కాగానే పనులు చేపడతామని ఆ శాఖ జేఈ సత్యనారాయణ తెలిపారు.

రతన్ టాటా మృతి తీరని లోటు

మునగాల గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రపంచం గర్వించదగిన పారిశ్రామిక వేత్త రతన్ టాటా మరణం దేశానికి తీరనిలోటని సామాజిక ఉద్యమకారుడు వేమూరి సత్యనారాయణ అన్నారు. నర్సింహాపురంలో రతన్‌టాటా మృతికి సంతాపం




మేళ్లచెరువులో కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న యువకులు

వ్యక్తం చేసి మాట్లాడారు. టాటా ట్రస్ట్‌ల ద్వారా ఆయన సేవలు మరువలేనివన్నారు.

మేళ్లచెరువు: ప్రముఖ పారిశ్రామికవేత్త రతన్ టాటాకు మేళ్లచెరువులో యువకులు గురువారం రాత్రి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవల్ని కొనియాడారు.

అపురూపం.. అమ్మ దర్శనం



కోదాడ పట్టణంలోని శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ..

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఎనిమిదో రోజు కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని స్వయంభు శ్రీ కనక దుర్గమ్మగా అలంకరణ చేశారు. పరాశక్తి అలంకారంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.

* ఐదో వార్డులో ఏర్పాటు చేసిన అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. పురపాలక చైర్‌పర్సన్ గెల్లి అర్చన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.


మునగాల: మండల కేంద్రంలోని కనకదుర్గ అమ్మవారి దేవాలయంలో ఆలయ అర్చకుడు కందాల ప్రశాంతాచార్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నడిగూడెం: యాదవనగర్‌లో ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహం ఎదుట యాదవ్ యూత్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

మేళ్లచెరువు: మేళ్లచెరువులోని వనదుర్గ అమ్మవారి ఆలయంలో మహంకాళి అలంకరణలో అమ్మవారు భక్తుల పూజలందుకున్నారు.

కోదాడ: పట్టణంలోని పలు కాలనీలో కోలాట పోటీలు నిర్వహించడంతో పాటు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

నేరేడుచర్ల: నేరేడుచర్ల విజయదుర్గ ఆలయం, శివాలయంలో, నర్సయ్యగూడెం, ఆటోనగర్, శివాజీనగర్‌లలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలలో అమ్మవారు దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.



హుజూర్‌నగర్‌లో..



మునగాల: దుర్గాదేవి అవతారంలో అమ్మవారు



మేళ్లచెరువులో మహంకాళి అలంకరణలో..



నేరేడుచర్ల శివాలయంలో..



హుజూర్‌నగర్: అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ అర్చన



గరిడేపల్లి: కట్టవారిగూడెంలో కుంకుమార్చన చేస్తున్న భక్తులు

సూర్యాపేట

• సూర్యాపేట • తుంగతుర్తి

మహిళల ఆత్మగౌరవం కాపాడిన కేసీఆర్: జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట సాంస్కృతికం, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం కేసీఆర్ బతుకమ్మ పండగను రాష్ట్ర పండగగా గుర్తించి మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. సద్దుల బతుకమ్మ పండగను పురస్కరించుకొని వాడవాడలా బతుకమ్మ ఆడుతున్న మహిళలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. సద్దుల చెరువులో బతుకమ్మను నిమజ్జనం చేశారు. ఆయన వెంట పురపాలిక ఛైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, భారాస నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రూ. పది కోట్లతో ట్యాంక్‌బండ్ అభివృద్ధి: పటేల్

సూర్యాపేట అర్బన్: సూర్యాపేట సద్దుల చెరువును రూ.పది కోట్లతో పర్యాటకంగా అభివృద్ధి చేస్తానని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి అన్నారు. సూర్యాపేట బతుకమ్మ చౌరస్తా వద్ద మహిళలకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు.

భానుపురి, న్యూస్‌టుడే:

? సూర్యాపేటలోని చంద్రన్నకుంటలో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. రాత్రి కునుకు లేకుండా చేస్తుండటంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. – శేఖర్, చంద్రన్నకుంట

✔ దోమల మందు పిచికారీ చేయిస్తాం. – సారగండ్ల శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, సూర్యాపేట

గౌరమ్మ వరమిచ్చే ఉయ్యాలో.. పాడిపంటలు కల్గు ఉయ్యాలో..

సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గ వ్యాప్తంగా గురువారం సద్దుల బతుకమ్మ వేడుకలు కనులపండువగా జరిగాయి. పల్లెలు, పట్టణంలోని ఆలయాలు, చెరువులు తీరొక్క పూలతో అలంకరించిన బతుకమ్మలతో కళకళలాడాయి. సాయంత్రం కొన్ని ప్రాంతాల్లో వర్షం కురిసి అంతరాయం కలిగించినా.. వెలిశాక మహిళలు బతుకమ్మలతో తరలి వెళ్లి ఆడిపాడారు. సంప్రదాయ పాటలు పాడి.. గౌరమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చెరువుల్లో నిమజ్జనం చేశారు. జిల్లాకేంద్రంలో వాడవాడల నుంచి మహిళలు బతుకమ్మలతో సద్దుల చెరువు వద్దకు చేరుకొని నృత్యాలు చేశారు. భారీగా తరలి వచ్చిన పిల్లలు, యువతులు, మగువలతో బతుకమ్మ చౌరస్తా సందడిగా మారింది. రాత్రి బతుకమ్మలను సద్దుల చెరువులో నిమజ్జనం చేసిన అతివలు ఒకరికొకరు వాయినాలు ఇచ్చి పుచ్చుకున్నారు.

– సూర్యాపేట సాంస్కృతికం, న్యూస్‌టుడే:


తిరుమలగిరిలో పెద్ద బతుకమ్మ


సూర్యాపేట: బతుకమ్మ ఆడుతున్న మహిళలు


సూర్యాపేటలో..


నూతనకల్‌లో బతుకమ్మతో యువతి


నాగారం: డి.కొత్తపల్లిలో బతుకమ్మలను ఎత్తుకొని వెళ్తున్న మహిళలు


బతుకమ్మలు పట్టుకొని మహిళలతో వెళ్తున్న నూతనకల్ పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ నాగం జయసుధ


సూర్యాపేటలో చిన్నారులు


సూర్యాపేట: అమ్మవారి గుడి ఆకారంలో తీర్చిదిద్దిన బతుకమ్మ


సూర్యాపేటలో..


నూతనకల్: లింగంపల్లిలో..


కోటపహాడ్‌లో బతుకమ్మ వేడుకల్లో పెద్దఎత్తున పాల్గొన్న మహిళలు


జాజిరెడ్డిగూడెం:కుంచమర్తిలో బతుకమ్మలతో మహిళలు



సూర్యాపేటలో..


ఆత్మకూర్(ఎస్): పాతసూర్యాపేటలో..


జాజిరెడ్డిగూడెం మండలం అర్వపల్లిలో..


సూర్యాపేటలో సద్దుల బతుకమ్మ వేడుకలకు భారీగా తరలివచ్చిన మహిళలు


సూర్యాపేటలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


ఆత్మకూర్(ఎస్)లో ఆకర్షణగా నిలిచిన పెద్ద బతుకమ్మ


మద్దిరాల: కుంటపల్లిలో..


సూర్యాపేటలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


పెన్‌పహాడ్: అనంతారంలో..


చివ్వెంలలో..

సమ్మోహనం.. దుర్గామాత దర్శనం


సూర్యాపేట: సంతోషిమాత ఆలయంలో దుర్గాదేవి అలంకరణలో అమ్మవారు

సూర్యాపేట సాంస్కృతికం, తిరుమలగిరి, మద్దిరాల, జాజిరెడ్డిగూడెం, మద్దిరాల గ్రామీణం, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాల్లో కనులపండువగా సాగుతున్నాయి. పలు మండపాల్లో అమ్మవారిని గురువారం దుర్గాదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. సూర్యాపేటలో కన్యకాపరమేశ్వరి, సంతోషిమాత, కనకదుర్గ అమ్మవారికి ఉదయం పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. దేవి సహస్రనామాలను పఠించారు.


కుక్కడంలో పూజలు చేస్తున్న భక్తులు

నూతనకల్: తాళ్లసింగారంలో దుర్గాభవాని ఫౌండేషన్ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం చేశారు.

ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల తరలించొద్దని నిరసన

తుంగతుర్తి, న్యూస్‌టుడే: తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రానికి మంజూరైన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలను ఇక్కడే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం స్థానికంగా తుంగతుర్తి అభివృద్ధి సాధన సమితి సభ్యులు మోకాళ్లపై నడుస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తుంగతుర్తి మంజూరైన ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలను ఇతర ప్రాంతాలకు తరలిస్తూ తీరని ద్రోహం చేస్తున్నారని విమర్శించారు. తుంగతుర్తి అభివృద్ధికి సహకరించకుంటే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో అభివృద్ధి సాధన సమితి సభ్యులు మట్టిపెల్లి శ్రీశైలంయాదవ్, బొంకూరి మల్లేశ్, మధు, శ్రీకాంత్, వెంకటేశ్, నాగమల్లు, రాజశేఖర్, అనిల్ పాల్గొన్నారు.


తుంగతుర్తిలో మోకాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న స్థానికులు

రెండు ఇసుక డంప్‌ల స్వాధీనం

పెన్‌పహాడ్, న్యూస్‌టుడే: మండలంలోని నాగులపహాడ్ శివారులో అక్రమంగా నిల్వచేసిన రెండు ఇసుక డంప్‌లను గురువారం రెవెన్యూ, పోలీసు సిబ్బంది సమన్వయంతో స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని ఎస్సై రవీందర్ తెలిపారు. గ్రామశివారులో సుంకరి సంజీవ భూమిలో 15 ట్రిప్పులు, భూక్యా టీకంనాయక్ భూమిలో తొమ్మిది ట్రిప్పుల ఇసుకను అక్రమంగా నిల్వచేశారు. ఆర్ఐ రంజిత్‌రెడ్డి, పోలీసులు ఇసుక డంప్‌లను గుర్తించి స్వాధీన పరుచుకున్నారు. ఆర్ఐ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

మాచనపల్లిలో వీధి దీపాల ఏర్పాటు

నూతనకల్ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని మాచనపల్లిలో గురువారం దాత వేల్పుల ఉప్పలయ్య రూ.20 వేలు వెచ్చించి 150 వీధి దీపాలు ఏర్పాటు చేశారు. గ్రామాభివృద్ధికి తోడ్పాటు అందించిన అతన్ని గ్రామస్థులు అభినందించారు.

వెంకటరెడ్డి మృతి తీరని లోటు

నూతనకల్, న్యూస్‌టుడే: తెలంగాణ ఉద్యమంలో తనతోపాటు పనిచేసి ఆ తర్వాత కాంగ్రెస్ బలోపేతానికి కృషిచేసిన సాబాది వాసుదేవ్‌రెడ్డి తండ్రి వెంకటరెడ్డి మృతి తీరనిలోటని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ పేర్కొన్నారు. గురువారం వెంకటరెడ్డి మృతిచెందగా విషయం తెలుసుకున్న ఆయన నూతనకల్‌కు చేరుకొని వెంకటరెడ్డి మృతదేహంపై పూలమాలవేసి పార్టీ జెండాకప్పి శ్రద్ధాంజలి ఘటించారు. మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి, తీగల గిరిధర్‌రెడ్డి, బొడ్డుపల్లి అంజయ్య, చురకంటి చంద్రారెడ్డి, కట్ట మల్లారెడ్డి, పన్నాల మల్లారెడ్డి, బద్దం వెంకటరెడ్డి పాల్గొన్నారు.

మనోవికాసంతో సంపూర్ణ ఆరోగ్యం

పెన్‌పహాడ్, న్యూస్‌టుడే: మనోవికాసంతో సంపూర్ణ ఆరోగ్య లభిస్తుందని మానసిక వైద్య నిపుణురాలు డాక్టర్ స్రవంతి అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా పెన్‌పహాడ్ పీహెచ్‌సీలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. మానసిక సమస్యను చికిత్స ద్వారా నయం చేయవచ్చని తెలిపారు. సదస్సులో మండల వైద్యాధికారిణి స్రవంతి, హెచ్ఈవో చంద్రశేఖర్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

కలలు ఫలించె.. కొలువు వరించె

ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగం సాధించాలన్నది వారి కల. చిరకాల స్వప్నాన్ని సాకారం చేసేందుకు వారు అహర్నిశలు కృషి చేశారు. అనుకున్న లక్ష్యాన్ని చేరుకున్నారు. తాజాగా వెల్లడైన డీఎస్సీ ఫలితాల్లో ఉపాధ్యాయ ఉద్యోగం సాధించిన విజేతలపై 'న్యూస్‌టుడే' కథనం.

– న్యూస్‌టుడే బృందం

ఒడిదొడుకులను ఎదుర్కొని.. లక్ష్యం చేరి

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: మండలంలోని నెమ్మికల్‌కు చెందిన గోలి సురేష్ ఒడిదొడుకులను ఎదుర్కొని ఉపాధ్యాయ కొలువు సాధించారు. నిరుపేద కుటుంబమైనా తల్లిదండ్రులు గోలి పుల్లయ్య, నాగమ్మ దంపతుల చిన్న కొడుకు సురేష్‌ను చదివించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివారు. 2012లో సూర్యాపేటలో డీఈడీ చదువుతుండగా అతని తల్లి అనారోగ్యంతో మృతిచెందారు. 2013లో అన్న రవి అనూహ్యంగా మరణించారు. ఆ దుఃఖంతోనే డీఈడీ పూర్తి చేశారు. డీఎస్సీ కోసం నిరీక్షిస్తూనే బీఈడీ పూర్తి చేశారు. వివాహం అనంతరం భార్య, ఇద్దరు పిల్లల పోషణ కోసం స్థానిక ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా చేరాడు. తాజా డీఎస్సీ ఫలితాల్లో 226వ ర్యాంకు సాధించి ఎస్జీటీగా ఎంపికయ్యారు.


భార్య, పిల్లలతో గోలి సురేష్

వాచ్‌మెన్ పనిచేస్తూ..



నాగారం, న్యూస్‌టుడే: ఉండడానికి కనీసం ఇల్లు కూడా లేదు. తండ్రి అనారోగ్యంతో దూరమయ్యారు. హైదరాబాద్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తూ.. ఖాళీ సమయంలో చదువుకొని ఎస్జీటీగా ఎంపికయ్యారు.. మండలంలోని డి.కొత్తపల్లి గ్రామానికి చెందిన వయ్యా సురేశ్. ఈయన తల్లిదండ్రులు భాగ్యయ్య, సుశీల. ఇటీవల తండ్రి అనారోగ్యంతో మృతి చెందారు. తన అక్కచెల్లెళ్ల వివాహ నిమిత్తం ఉన్న ఇంటిని విక్రయించారు. పేదరికాన్ని అనుభవిస్తూ ఉద్యోగం సాధించిన అతన్ని గ్రామస్థులు అభినందిస్తున్నారు.

తండ్రి లక్ష్యాన్ని సాధించిన తనయుడు



చివ్వెంల, న్యూస్‌టుడే: మండలంలోని బండమీది చందుపట్లకు చెందిన విద్యావంతుడైన గుణగంటి వెంకన్న ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సాధించాలని పలుమార్లు ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. ప్రైవేటు ఉపాధ్యాయుడిగా పలు పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్నారు. తన తండ్రి పడిన కష్టాన్ని కళ్లారా చూసిన తనయుడు గుణగంటి క్రాంతికుమార్ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సాధించాలని లక్ష్యం నిర్దేశించుకున్నారు. ప్రైవేటు ఉద్యోగం చేస్తూనే పట్టు వదలకుండా పరీక్షలు రాస్తూ నాలుగో ప్రయత్నంలో ఉద్యోగం సాధించారు. ఎస్జీటీగా ఎంపికైన క్రాంతికుమార్‌ను కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్థులు అభినందించారు.



తల్లిదండ్రుల బాటలో..



తుంగతుర్తి, న్యూస్‌టుడే: తల్లిదండ్రుల అడుగుజాడల్లో నడుస్తూ వారిలాగానే ఆంగ్లోపాధ్యాయుడిగా మొదటి ర్యాంకుతో ఉద్యోగం సాధించారు.. సూర్యాపేటకు చెందిన దంతాల శరత్. తండ్రి ప్రభాకర్ ప్రభుత్వ పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. తల్లి సంధ్యారాణి ప్రభుత్వ పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయినిగా విధులు నిర్వహిస్తున్నారు. వారికి ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు బ్యాంకు మేనేజరు. చిన్న కుమారుడు శరత్ డిగ్రీ, పీజీ(ఆంగ్లం), టీటీసీ, బీఈడీ పూర్తి చేశారు. ఉపాధ్యాయ ఉద్యోగం సాధనకు పలు పోటీ పరీక్షలకు కష్టపడి చదివారు. గురుకుల ఉపాధ్యాయ ప్రవేశ పరీక్షలో పీజీటీ, టీజీటీ ఉద్యోగాలు సాధించారు. నాగారంలోని బీసీ గురుకుల విద్యాలయంలో పీజీటీగా విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల నిర్వహించిన డీఎస్సీ పరీక్ష రాసి ప్రతిభ చాటారు. ఆంగ్లంలో స్కూల్ అసిస్టెంట్‌గా జిల్లా మొదటి ర్యాంకుతో పాటు, ఎస్జీటీ ఉద్యోగాన్ని కూడా సాధించారు. 'తల్లిదండ్రుల బాటలో స్కూల్ అసిస్టెంట్ ఆంగ్ల ఉపాధ్యాయుడిగా కొనసాగుతాన'ని శరత్ తెలిపారు.

రక్తదానంతో ఆయువు పోసి..

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: ప్రాణాపాయ స్థితిలో ఉన్న మహిళకు ఏడుగురు యువకులు రక్తదానం చేసి ఆయువు పోశారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నెమ్మికల్‌కు చెందిన మోరపాక వెంకన్న భార్య చంద్రకళ గర్భసంచికి సంబంధించిన జబ్బుతో సూర్యాపేటలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. తీవ్ర రక్తస్రావం కావడంతో అత్యవసరంగా బీపాజిటివ్ రక్తం ఎక్కించడానికి కుటుంబ సభ్యులు దాతల కోసం అన్వేషించారు. ఏలె గణేశ్ అనే యువకుడి ద్వారా సమాచారం తెలుసుకున్న పాతర్లపహాడ్‌లోని వేక్ సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధి జి.గణేశ్ నెమ్మికల్ యువకులకు అవగాహన కల్పించారు. వెంటనే ఏడుగులు యువకులు మోరపాక సుధాకర్, నగేష్, జానయ్య, సతీష్, దండా మధుకర్‌రెడ్డి, పారెల్లి నాగయ్య, ఎం.జానయ్యలు గురువారం ఆసుపత్రికి వెళ్లి రక్తదానం చేశారు. వారికి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.


రక్తదానం చేస్తున్న నెమ్మికల్ యువకులు

అవీ ఇవీ

ఎల్వోసీ అందజేత.. మద్దిరాల గ్రామీణం, న్యూస్‌టుడే: మద్దిరాల మండలం గోరెంట్ల గ్రామానికి చెందిన పాల్వాయి వెంకన్న కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయనకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.2.50 లక్షల ఎల్వోసీని కాంగ్రెస్ నాయకుడు బద్ధం వంశీరెడ్డి అందజేశారు.

క్రీడలతో శారీరక దృఢత్వం.. జాజిరెడ్డిగూడెం: క్రీడలతో శారీరక దృఢత్వం కలిగి ఉంటారని అర్వపల్లి ఎస్సై బాలకృష్ణ అన్నారు. జాజిరెడ్డిగూడెం గ్రామంలో పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ పోటీలు బుధవారం రాత్రి ముగిశాయి. మొదటి, ద్వితీయ, తృతీయ, చతుర్థి బహుమతులను వరసగా జాజిరెడ్డిగూడెం, లోయపల్లి, పర్సాయపల్లి, జాజిరెడ్డిగూడెం బీ జట్టు గెలుపొందింది. దాతలు ఎల్లెంల కొమిరెల్లి రూ.12 వేలు, సుతారపు కిష్టయ్య రూ.10 వేలు, ఉప్పు సురేష్ రూ.8 వేలు, గట్టిగొర్ల కిరణ్ యాదవ్ రూ.6 వేలు నగదును విజేతలకు అందజేశారు. పూర్వ విద్యార్థులు బింగి కృష్ణమూర్తి, సుతారపు అనిల్, అక్కులు, శ్రీనివాస్, సత్తయ్య, శ్రీశైలం , వీరయ్య పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ.. నాగారం, న్యూస్‌టుడే: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని నాయబ్ తహసీల్దార్ షాహీన్‌బేగం అన్నారు. మండలంలోని డి.కొత్తపల్లి గ్రామపంచాయతీ పారిశుద్ధ్య సిబ్బందికి గురువారం సబ్బులు, నూనెలు పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి కొమ్ము అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌కు ఫర్నిచర్ అందజేత.. నూతనకల్ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని యడవెల్లికి చెందిన భారాస నాయకుడు, తుంగతుర్తి మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గాజుల తిరుమలరావు గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌కు రూ.70 వేలు విలువైన ఫర్నిచర్ అందజేశారు. కార్యక్రమంలో ఎస్సై మహేంద్రనాథ్, భారాస మండల అధ్యక్షుడు మున్నా మల్లయ్యయాదవ్, సాయి కుమార్, లింగయ్య పాల్గొన్నారు.